# అనుమతులు ఇలా.. నిర్మాణాలు మరోలా!

**అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిజాంపేట్ కార్పొరేషన్**

**ముందు కట్టండి.. తర్వాత అనుమతులిస్తామంటూ అధికారుల భరోసా**

**భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి**

దుండిగల్, ఏప్రిల్ 6: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుందనడంలో అతిశయోక్తి లేదు. ఎటు చూసినా అక్రమ కట్టడాలు, అనుమతులు లేని నిర్మాణాలే దర్శనమిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు పట్టణ ప్రణాళిక విభాగంలో నెలకొన్న అనిచ్ఛితే కారణమంటున్నారు. నిజాంపేటలో పనిచేసే అసిస్టెంట్ సిటీ ప్లానర్, సెక్షన్ అధికారులు రెగ్యులర్ ఉద్యోగులు కాకపోవడం, వారంలో ఏసీపీ మూడు రోజులు, టీపీఎస్ మరో మూడు రోజులు విధులు హాజరు కావడం అక్రమార్కులకు, కింది స్థాయి ఉద్యోగులకు కలిసి వస్తుందనే విమర్శలు చెలరేగుతున్నాయి. ఓ వేళ సంబంధిత శాఖాధికారులు విధులకు హాజరైనా తమ పనుల్లో నిమగ్నం అవుతారే తప్ప ప్రజా ప్రయోజనాలపై దృష్టి పెట్టరని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంతసేపు తమకు ఏమి మిగులుతుంది.. అనే ధ్యాసే తప్ప అక్రమ నిర్మాణాలతో భవిష్యత్తులో తలెత్తే ఇబ్బందులపై ఎంత మాత్రం ఆలోచన చేయడం లేదని పలువురు వాపోతున్నారు. ఫలితంగా ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు లేని, అక్రమ కట్టడాలు నిజాంపేట కార్పొరేషన్‌లో యథేచ్ఛగా సాగుతున్నాయని దీంతో కార్పొరేషన్‌కు తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందన్నారు.

**జీ ప్లస్ టుకు అనుమతులు తీసుకొని..**

– నిజాంపేట కార్పొరేషన్, బాచుపల్లి పరిధిలోని రేణుకా ఎల్లమ్మ కాలనీలో సుమారు 200 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి జీ ప్లస్ టు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఏకంగా ఐదంతస్తులు నిర్మించాడు. అంతటితో ఆగకుండా పెంట్‌హౌస్ సైతం నిర్మిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. పైగా రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టడంతో పాటు షటర్లు వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని, ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నాడని స్థానికులు వాపోతున్నారు. '' అధికారులకు ఇచ్చేది ఇచ్చేశాం.. ఇక ఎవరూ మమ్మల్ని ఏం చేయలేరు.'' అని పలువురిని బెదిరించినట్లు సమాచారం.



సిరి ర్యాలీ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న స్విమ్మింగ్‌పూల్

**అసైన్డ్ భూమిలో ఆరంతస్తులు...**

– నిజాంపేటలోని సైదప్ప కాలనీ సమీపంలో ఉన్న సర్వేనెంబర్ 191 ప్రభుత్వ భూమిలో ఏకంగా సుమారు 250 గజాల స్థలంలో భవనం నిర్మిస్తున్నాడు. అయితే ఈ భవనానికి సంబంధించి గతంలోనే జీవో 59 ప్రకారం ప్రభుత్వ భూమిని రెగ్యులరైజ్ చేయించుకుని, జీ ప్లస్ టూ అంతస్తుల కోసం రెండు ప్లాట్లకు వేరువేరుగా అనుమతులు తీసుకొని తదనంతరం రెండింటిని క్లబ్ చేసి ఒకే భవనంగా నిర్మిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానిక సీపీఎం నేత పలుమార్లు టౌన్ ప్లానింగ్, కలెక్టరేట్లో ఫిర్యాదు చేసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక అవినీతి దాగి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా దున్నపోతు మీద వాన పడ్డట్టే ఉందని పలువురు పేర్కొంటున్నారు.

**మీరు కట్టుకోండి... మేం తర్వాత అనుమతులు ఇస్తాం!**

–కాగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి 30వ డివిజన్‌లోని సిరివ్యాలి గేటెడ్ కమ్యూనిటీని ఆనుకుని సుమారు అర ఎకరం స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండానే ఒకరు స్విమ్మింగ్‌పూల్ నిర్మించడం చర్చనీయాంశంగా మారింది. పేద ప్రజలు చిన్న గూడు నిర్మించుకుంటేనే అనుమతుల పేరుతో కూల్చివేస్తూ నానా హంగామా చేసే అధికారులు.. రెండు నెలలుగా భారీ షెడ్డును నిర్మించడంతోపాటు, ఈత కొలను కోసం భారీగా మట్టి తవ్వుతున్నా అటువైపు చూడకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై స్విమ్మింగ్ పూల్ నిర్మాణదారుడు తాము మున్సిపల్ అధికారులను మేనేజ్ చేశామని బాహాటంగానే చెప్పుకోవడంతోపాటు ''ముందు మీరు కట్టుకోండి.. తర్వాత మేమే ట్రేడ్ లైసెన్స్ ఇస్తాం'' అంటూ భరోసా కల్పించారని చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను నిలువరించాల్సిన వారే ప్రోత్సహిస్తే ప్రభుత్వ ఆదాయానికి గండి పడటం ఖాయమని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. నిజాంపేట మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై సీడీఎంఏ అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అయితే కిందిస్థాయి సిబ్బంది చేతివాటం కారణంగానే కార్పొరేషన్ పరిధిలో అక్రమ కట్టడాలు, అనుమతి లేని నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయని స్పష్టమవుతున్నాయి.



నిజాంపేటలోని సైదప్ప కాలనీ సమీపంలో రెండు ప్లాట్లను కలుపగా తయారవుతున్న ఆరు అంతస్తుల నిర్మాణం



రేణుకాఎల్లమ్మ కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న బహుళ అంతస్తుల



కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్ రెడ్డిని సన్మానిస్తున్న గాంధీ అలూమ్నీ అసోసియేషన్ సభ్యులు

## కాళోజీ వర్సిటీని ఆదర్శంగా మారుస్తాం

**వీసీ డాక్టర్ నందకుమార్ రెడ్డి**

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 6 : రాష్ట్రంలో నాణ్యమైన వైద్య విద్యను అందించేందుకు కృషి చేస్తూనే.. దేశంలోనే అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు కలిగిన హెల్త్ యూనివర్సిటీగా కాళోజీని తీర్చిదిద్దుతానని గాంధీ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పీవీ నందకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ వైద్య కళాశాల అలుమ్ని హాలులో జరిగిన సన్మాన సభలో డాక్టర్ నందకుమార్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 ఏండ్లు నేత్ర వైద్యుడిగా, 20 ఏండ్లు ప్రొఫెసర్‌గా వైద్య విద్యార్థులకు బోధన అధ్యాపకుడిగా పని చేశానని, తనకు అప్పగించిన వివిధ బాధ్యతలను నిజాయితీగా, సమర్థవంతంగా, నిర్వహించానని ఆయన అన్నారు. మే నెలలో వరంగల్‌లోని హెల్త్ యూనివర్సిటీలో కాన్వకేషన్ నిర్వహిస్తామన్నారు. హైదరాబాదులో ఉన్న బ్రాంచ్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. రీసెర్చ్ చేయడానికి వైద్యుల ముందుకు రావాలని, వారికి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు. 1973 బ్యాచ్‌లో తాను గాంధీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివానని, తన పుట్టినింట్లో తనను సన్మానించడం కొత్త అనుభూతిస్తుందన్నారు. గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఇందిరా, గాంధీ మెడికల్ కళాశాల అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి ఆర్ లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ ఏవీ రత్నం, కోశాధికారి డాక్టర్ అభిలాశ్, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, అలుమ్ని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ నర్సింగ్‌రావు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ మహేష్, సభ్యులు డాక్టర్ రమేశ్, డాక్టర్ సన్నీ డేవిస్, 1973 బ్యాచ్ ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల బేసిక్ లైఫ్ సేవింగ్ కోర్స్ పూర్తి చేసుకున్న డాక్టర్లకు సర్టిఫికెట్లను అందించారు.



నాచారంలో పేరుకుపోయిన చెత్తాచెదారం..

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు

**తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ**

కాచిగూడ, ఏప్రిల్ 6: ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంబీఏ, ఎంసీఏ, పేజీ,డిగ్రీ,తదితర కోర్సులు చదువుతున్న 14 లక్షల 75 వేల విద్యార్థుల భవిష్యత్‌లో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం తక్షణమే హెచ్‌సీయూలోని 400 ఎకరాల వేలం పాట ప్రక్రియ వెనక్కు తీసుకోవాలంటూ.. బర్కత్‌పురా ఎక్స్ రోడ్ లో విద్యార్థి సంఘాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అన్ని రంగాల్లో విఫలమయ్యారన్నారు. విద్యపై కనీస అవగాహన లేని సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన గుప్పెట్లో పెట్టుకొని విద్యావ్యవస్థనే భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు.

## కాంగ్రెస్ మొండిగా వ్యవహరించడం మానుకోవాలి

**పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడటం నేరం**

**సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్**

సిటీబ్యూరో, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : హెచ్‌సీయూ భూములమ్మి ప్రభుత్వం నడపాలనుకోవడం తెలివి తక్కువ పని అని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే కంచె గచ్చిబౌలి భూముల జోలికి వెళ్లకుండా అక్కడి పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలు మానుకోవాలని సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో పర్యావరణన్ని నాశనం చేసి 734 రకాల మొక్కలు, వందలాది పక్షులు ఉన్న ప్రాంతంలో వందల జేసీబీలతో వెళ్లి చెట్లు నరకడం.. అడ్డువచ్చిన విద్యార్థులను కొట్టడం, కేసులు పెట్టడం ఇదేనా ప్రజా పాలన ప్రభుత్వం చేయాల్సిన పనులా అని ప్రశ్నించారు. పర్యావరణం దెబ్బతీయడం వల్ల హైదరాబాద్ కూడా ఢిల్లీలా కాలుష్య కుంపటిగా మారడం ఖాయమన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే జాతీయ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో కృష్ణా జలాల అక్రమ తరలింపుపై ఆంధ్రప్రదేశ్ సర్కార్‌పై చేసిన పోరాటం మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరు చేస్తామన్నారు.

# ఆదర్శమూర్తి.. శ్రీరామ చంద్రుడు

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

అబిడ్స్, జియాగూడ, ఏప్రిల్ 6: ఆదర్శమూర్తుడు శ్రీరామ చంద్రుడని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఆదివారం దూల్‌పేట్‌లో బీఆర్‌ఎస్ నేత ఆనంద్ సింగ్ ఏర్పాటు చేసిన సీతారామ లక్ష్మణుల పల్లకి సేవను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హితభాషి, మితభాషి, పూర్వభాషి''గా ఉండాలన్నారు. ఎల్లప్పుడూ తెలివిగా మాట్లాడాలని, ఇతరుల బాధను అర్థం చేసుకున్న తర్వాత తక్కువగా మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు పెద్ద ఎత్తున జరుపుకుంటారని తెలిపారు. దూల్‌పేటలో సీతారాముల పల్లకి ఊరేగింపులో పాల్గొనేందుకు అవకాశం తనకు లభించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఆమె శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆమె చాక్లెట్లను పంపిణీ చేశారు. రామ లక్ష్మణ్ జానకి.. జై బోలో హనుమాన్ జీ కి అంటూ ఆమె పాటలు పాడి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ సింగ్, పప్పు మాత్రే, ఆశిష్ కుమార్ యాదవ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, నాంపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ సీహెచ్‌ఆ.నంద్ కుమార్ గౌడ్, ఎం.ఆనంద్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్త దంపతులు, ప్రియా గుప్తా, శ్రీనివాస్ గౌడ్, ప్రదీప్ పాల్గొన్నారు.



సీతారాముల పల్లకి ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం పలికిన నాయకులు..**

దూల్‌పేట్‌లో సీతారాముల పల్లకి ఊరేగింపు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నాయకులు ఘన స్వాగతం పలికారు. గోషామహల్ నియోజకవర్గం లో ఆనంద్ సింగ్ నిర్వహిస్తున్న ఈ పల్లకి ఊరేగింపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత విచ్చేయగా నాయకులు ఆమెకు అడుగడుగునా స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించి కిరీటంతో సన్మానించారు.

# ప్రశాంతంగా శోభాయాత్ర

**సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు..**

**అడుగడుగునా పోలీసు నిఘా**

సిటీబ్యూరో, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): అడుగడుగునా పోలీసు నిఘా మధ్య హైదరాబాద్‌లో శ్రీరామనవమి శోభాయాత్ర భక్తజనం నీరాజనాల మధ్య కనులపండువగా ముగిసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీబందోబస్తు నిర్వహించారు. సీతారాంబాగ్ వద్ద మొదలైన శోభాయాత్ర హనుమాన్ వ్యాయామశాల వరకు ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ యాత్ర బందోబస్తను నిర్వహించారు. సుమారు 20వేల మంది పోలీసులు ఈ బందోబస్తులో విధులు నిర్వర్తించారు. ఆదివారం మధ్యాహ్నం సీతారాంబాగ్ నుంచి ప్రారంభమైన యాత్ర రాత్రి సుల్తాన్‌బజార్ హనుమాన్ వ్యాయామశాల వరకు సాగింది. ప్రధాన ఊరేగింపులు మంగళ్‌హాట్, బేగంబజార్‌చత్రి, సిద్దియంబర్‌బజార్, గౌలిగూడ కమాన్, గురుద్వారా, పుత్లీబౌలి చౌరస్తా, కోఠి ఆంధ్రబ్యాంక్ మీదుగా సుల్తాన్‌బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వద్దకు చేరుకున్నాయి.ఈ మొత్తం యాత్రలో శాంతిభద్రతల పరిస్థితిని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు సీపీ సీవీ ఆనంద్, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ, ఈఎంఆర్ఐ, అగ్నిమాపకశాఖ, విద్యుత్ శాఖ, ట్రాఫిక్ పోలీసుల అధికారులతో కలిసి సీసీ కెమెరాల ద్వారా వీక్షిస్తూ క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులకు సూచనలిచ్చారు. సీసీ ఫుటేజ్‌తో పాటు డ్రోన్ ఫుటేజ్‌లను చూస్తూ రేడియో కమ్యూనికేషన్ల ద్వారా వాట్సప్ గ్రూపుల ద్వారా అధికారులను అలర్ట్ చేశారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్‌లతో పాటు పలువురు డీసీపీలు, ఏసీపీలు క్షేత్రస్థాయిలో ఉండి ఊరేగింపు సజావుగా సాగేలా చూశారు. ఈ యాత్ర ప్రశాంతంగా పూర్తి కావడానికి సహకరించిన వారందరికీ సీపీ సీవీ ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు.




సీసీ టీవీల ద్వారా శోభాయాత్రను పరిశీలిస్తున్న సీపీ సీవీ ఆనంద్



సికింద్రాబాద్ కృష్ణానగర్ కాలనీలో శ్రీరామ నవమి సందర్భంగా స్వామి వారికి 108 రకాల ప్రసాదాలు సమర్పించిన భక్తులు

# వెడల్పు తగ్గించరు.. పరిహారం పెంచరు

**సందిగ్ధంలో రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులు**

**గ్రామ సభలను నిరాకరిస్తున్న బాధితులు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరానికి తలమానికమయ్యే ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులు సందిగ్ధంలో పడ్డాయి. జేబీఎస్ నుంచి శామీర్‌పేట్, ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం వరకు నిర్మించనున్న దాదాపు 18 కిలో మీటర్ల పొడవైన ప్రాజెక్టులకు భూసేకరణ ఇబ్బందులు తొలగడం లేదు. ఇప్పటికే సేకరించాల్సిన ఆస్తులకు మార్కింగ్ చేసి, అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. కానీ క్షేత్రస్థాయిలో ఎదురైతున్న వ్యతిరేకత ప్రాజెక్టును ముందుకు కదలకుండా నిలవరిస్తోంది.



**రెండు జిల్లాల్లో ఆస్తుల సేకరణ..**

ప్రాజెక్టుకు అవసరమైన ఆస్తుల సేకరణ ప్రక్రియ రెండు జిల్లాల పరిధిలో జరుగుతోంది. మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లా యంత్రాంగం ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఉన్న ఆస్తుల సేకరణ హెచ్‌ఎండీఏకు తలనొప్పిగా మారింది. ఇప్పటికీ హైదరాబాద్ జిల్లా వాసులు ప్రాజెక్టు వెడల్పును 200 నుంచి 120–150 ఫీట్లకు తగ్గించాలని, పరిహారం విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే తప్పా.. ప్రాజెక్టుకు భూములు ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్నారు. ప్రాజెక్టు ద్వారా భూములు కోల్పోయే యజమానులతో గ్రామ సభలకు ఏర్పాటు చేసినా.. ప్రాజెక్టు వెడల్పు విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఇప్పటివరకు జరిగిన సమావేశాలకు స్థానికులు దూరంగా ఉంటున్నారు. ఇదే సమయంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే వందలాది మంది బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఇక హైదరాబాద్ జిల్లా పరిధిలో రెండు మార్గాల్లో 500కు పైగా మంది తమ ఆస్తులను కోల్పోతుండగా... ఇప్పటికీ 10శాతం కూడా పూర్తి కాలేదని తెలిసింది. ఈ జాప్యానికి భూసేకరణ అధికారులు తీవ్ర అసహనంతో ఉన్నారు.

**కార్యరూపంలోకి రాని ప్రణాళికలు..**

నార్త్ సిటీకి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నా... ప్రాజెక్టు భూసేకరణ విషయంలో ప్రజాభిప్రాయానికి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతోనే ప్రాజెక్టు శంకుస్థాపన చేసి ఏడాది గడిచినా.. ప్రాజెక్టును పట్టాలెక్కించడంలో విఫలమయ్యారు.ప్రాజెక్టుకు డిఫెన్స్ శాఖ నుంచి భూములను తామే సేకరించామని గొప్పలు చెప్పుకుంటున్నారే తప్పా.. భూసేకరణ పూర్తి చేయడంలో విఫలం అవుతున్నారు. దీంతో దాదాపు 18 కిలో మీటర్ల మేర రెండు ప్రధాన మార్గాల్లో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల డిజైన్లు ఖరారైన, ప్రణాళికలను అమలు చేయడంలో హెచ్‌ఎండీఏ ముందుకు వెళ్లడం లేదు. ఈ రెండు ప్రాజెక్టులు ప్యాట్నీ నుంచి తూంకుంట వరకు వెస్ట్ మారేడ్‌పల్లి, కర్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, ఆల్వాల్, హకీంపేట్ మీదుగా తూంకుంట వరకు ఉండే 12 కిలోమీటర్లు, ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం(దూలపల్లి)వరకు 5.5 కిలో మీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను హెచ్‌ఎండీఏ నిర్మించనుంది.

## శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 6: శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని దోపిడీ పీడనలు ఉన్నంత కాలం ప్రజా పోరాటాలు కొనసాగడం ఖాయమని పలువురు వక్తలు అన్నారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ పై కాల్పులు జరిపిన రోజును గుర్తు చేసుకుంటూ పాటపై తూటా, ప్రశ్నించే గొంతులు పాలకుల అణచివేతపై సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ రచయిత మినా కందాస్వామి మాట్లాడుతూ ప్రజా సంస్కృతిని పాలకులు నిశబ్ధంగా మారిస్తే గద్దర్ ఆ నిశబ్ధాన్ని బద్దలు కొట్టారని అన్నారు. ప్రశ్నించే కవులు,రచయితలు, సామాజిక కార్యకర్తలను అర్బన్ నక్సల్స్ గా కేంద్ర ప్రభుత్వం ముద్ర వేస్తున్నదన్నారు. ఈ సంవత్సరం లో 145 మంది ఆదివాసీలను మావోయిస్టులుగా ముద్ర వేసి హత్య చేశారన్నారు. 2026 వరకు నక్సలిజాన్ని అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించడం సిగ్గు చేటన్నారు. అధ్యక్షత వహించిన ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినందున ప్రభుత్వం అంగీకారం తెలుపాలన్నారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలను ఆమోదించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాయకురాలు విమలక్క, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, జనసేన పార్టీ జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్, గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జి.వి.సూర్యకిరణ్, దళిత బహుజన ఫ్రంట్( డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జీలకర్ర శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు ఆస శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.




ప్రతిజ్ఞ చేస్తున్న రచయిత మినా కందాస్వామి, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ